

ఉద్యోగులపై వరాల జల్లు

● 2 శాతం కరువుభత్యం పెంపు ● అర్జిత సెలవులకు నగదు

● వివాహ రుణం రూ.5 లక్షలకు, పండుగ రుణం రూ.20 వేలకు పెంపు

● అసెంబ్లీలో సీఎం ప్రకటన



శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వరాల జల్లు కురిపించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం శాసనసభలో 110వ నిబంధన కింద ప్రత్యేక ప్రకటన చేస్తూ.. 9 వరాలు ప్రకటించారు. ద్రావిడ తరహా పాలనలో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలన్నీ ప్రజలకు చేర్చేందుకు కృషి చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల కరవుభత్యాన్ని 2 శాతం పెంచనున్నట్లు పేర్కొన్నారు. పెంచిన కరవుభత్యం జనవరి ఒకటి నుండే వర్తింపజేయనున్నట్లు తెలిపారు. కరవు భత్యం పెంపు కారణంగా ప్రభుత్వానికి యేటా రూ.1252 కోట్ల మేరకు అదనపు భారం పడినా సుమారు 16 లక్షలమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కుటుంబ పింఛనుదారులు లబ్ధిపొందుతారని చెప్పారు.

అర్జిత సెలవులకు నగదు పునరుద్ధరణ

కొవిడ్ సమయంలో క్షీణించిన ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నిలిపివేసిన అర్జిత సెలవులను నగదుగా మార్చుకునే పద్ధతిని పునరుద్ధరించనున్నట్లు సభ్యుల హర్షధ్వానాల నడుమ స్టాలిన్ ప్రకటించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి మళ్ళీ అమలు చేయనున్నట్లు తాము బడ్జెట్ ప్రతిపాదనలో ప్రకటించినప్పటికీ తమకు ఈ యేడాది నుంచే అర్జిత సెలవులను నగదుకు మార్చుకునేందుకు అనుమతించాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ యేడాది అక్టోబర్ 1 నుండి 15 రోజుల అర్జిత సెలవులను నగదుగా మార్చుకునే వెసలుబాటు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. అర్జిత సెలవులను నగదుగా మార్చుకునే విధానంతో యేడాదికి రూ.3561 కోట్ల మేరకు ప్రభుత్వంపై ఆర్థిక వ్యయ భారం పడుతుందన్నారు.

ప్రసూతి సెలవు 12 నెలలు...

రాష్ట్రంలో ఉద్యోగినులకు ప్రస్తుతం ఇస్తున్న ప్రసూతి సెలవులను 9 నెలల నుండి 12 నెలలకు పెంచనున్నామని స్టాలిన్ ప్రకటించారు. 12 నెలలపాటు వారికి వేతనంతో కూడిన సెలవుదినాలుగా పరిగణిస్తామన్నారు. ప్రొబేషన్ పీరియడ్‌లో ఉన్న మహిళలకు కూడా ఈ సెలవులు, వేతనాల వర్తింపు అమలులో ఉంటుందన్నారు.

ఫెస్టివల్ అడ్వాన్స్ పెంపు...

అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పండుగలను కుటుంబ సభ్యులతో జరుపుకునేలా ప్రభుత్వం ఇచ్చే పండు గ రుణాన్ని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదే రీతిలో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల ఉన్నత విద్య కోసం ప్రభుత్వం ఇచ్చే విద్యారుణాన్ని ఈ యేడాది నుండి సాంకేతిక విద్యకు రూ.లక్ష, ఆర్ట్స్ పాలిటెక్నిక్ విద్యకు రూ.50వేలుగా పెంచి ఇవ్వనున్నట్లు తెలిపారు.

పింఛను విధానంపై త్వరలో ప్రకటన

సుదీర్ఘకాలంగా పాత పింఛన్ విధానాన్ని మళ్లీ అమలు చేయాలా? లేక ప్రస్తుతం అమలులో ఉన్న కొత్త పింఛన్ విధానాన్నే కొనసాగించాలా? అనే అంశాలపై తగు నిర్ణయం తీసుకునేందుకు ఏర్పాటైన కమిటీ ఈ యేడాది సెప్టెంబర్ 30లోపే నివేదిక సమర్పించాలని ఆదేశించామని, ఆ కమిటీ సిఫారసుల ప్రకారం పింఛన్ పద్ధతిని గురించి అధికారికంగా ప్రకటిస్తామని స్టాలిన్ చెప్పారు. కాగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇప్పటి వరకు పొందుతున్న వివాహ రుణాలను ఊహించని విధంగా ఈ యేడాది నుండి పెంచనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ ఉద్యోగినులకు రూ.10వేలు, ఉద్యోగులకు రూ.6వేలు చొప్పున వివాహ రుణసదుపాయం ఇచ్చామని, ఇకపై ఆడ, మగ అనే తేడా లేకుండా ఉద్యోగులందరికీ రూ.5లక్షల మేరకు వివాహ రుణం మంజూరు చేస్తామన్నారు. ఇక సి, డి గ్రేడ్ ఉద్యోగులు పింఛనర్లకు సంక్రాంతికి ఇచ్చే నగదు కానుకను రూ.500ల నుండి రూ.1000లకు పెంచుతున్నట్లు తెలిపారు. ఇదే విధంగా పింఛనర్లకు పండుగ కాలాల్లో ఇచ్చే అడ్వాన్సును రూ.4వేల నుండి 6వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

'కరుణానిధి' పేరుతో కొత్త విశ్వవిద్యాలయం

● ఆ వర్సిటీ పరిధిలో 17 కళాశాలలు ● అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి కోవి చెళియన్



చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరుతో తంజావూరు జిల్లా కుంభకోణంలో కొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించి శాసనసభలో సోమవారం ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ ముసాయిదా చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఇటీవల శాసనసభలో డీఎంకే మిత్రపక్షాల సభ్యులు మాజీ ముఖ్యమంత్రులు కామరాజర్, అన్నాదురై ఎంజీఆర్, జయలలిత పేర్లతో విశ్వవిద్యాలయాలున్నాయని, విద్యారంగానికి విశేష కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరుతో విశ్వవిద్యాలయం లేకపోవడం శోచనీయమన్నారు. ఆ సభ్యుల డిమాండ్‌పై ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ తంజావూరు జిల్లా కుంభకోణంలో కరుణానిధి పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈమేరకు శాసనసభలో మంత్రి కొవి చెళియన్ ముసాయిదా చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఆ ప్రకారం అరియలూరు, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు జిల్లాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించటం కోసం ఈ 'కలైంజర్ విశ్వవిద్యాలయం' ఏర్పాటవుతుందని చెప్పారు. ఈ విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాన్సలర్‌గా వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు. కుంభకోణం ప్రభుత్వ కళాశాల, తంజావూరు రాజా సర్ఫోజీ ప్రభుత్వ కళాశాల, తిరువారూరులోని తిరువిక ప్రభుత్వ కళాశాల, కుడైవాసల్ పురట్చితలైవర్ ఎంజీఆర్ ప్రభుత్వ కళాశాల సహా 17 కళాశాలలు ఈ కొత్త విశ్వవిద్యాలయం పరిధిలోకి వస్తాయని మంత్రి చెప్పారు.

మళ్లీ మంత్రిగా మనో తంగరాజ్

ప్రమాణం చేయించిన గవర్నర్ ● పాడి పరిశ్రమల శాఖ కేటాయింపు



మనో తంగరాజ్ చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా పద్మనాభపురం ఎమ్మెల్యే, డీఎంకే సీనియర్ నేత మనో తంగరాజ్ మంత్రి పదవి అధిరోహించారు. సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మనో తంగరాజ్ చేత గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, కొంతమంది సీనియర్ మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మనో తంగరాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలపగా, అందుకు ఆయన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా మంత్రిగా మనో తంగరాజ్ ప్రమాణస్వీకారం ముగిసిన కొద్దిసేపటికే సీఎం సిఫారసు మేరకు ఆయనకు పాడి పరిశ్రమల శాఖను కేటాయించినట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. గతంలోనూ ఆయన ఇదే శాఖను నిర్వర్తించడం గమనార్హం.

స్టాలిన్ మంత్రివర్గంలో రెండోమారు అవకాశం

కన్నియాకుమారి జిల్లాకు చెందిన 57 సంవత్సరాల మనో తంగరాజ్ ఆది నుంచి డీఎంకేలోనే ఉన్నారు. ఆయన తొలిసారిగా 2016లో పద్మనాభపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యారు. 2021లోనూ అదే నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. దాంతో ముఖ్యమంత్రి స్టాలిన్ మంత్రివర్గంలో చోటు లభించింది. 2023 మే 10వ తేదీ వరకు సమాచార, సాంకేతిక శాఖ నిర్వర్తించిన ఆయన.. ఆ తరువాత పాడి పరిశ్రమల శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కానీ వివిధ ఆరోపణల కారణంగా ఆయన్ని గత ఏడాది సెప్టెంబరు 28వ తేదీన మంత్రివర్గం నుంచి సీఎం తొలగించారు. అయితే తాజాగా సెంథిల్ బాలాజీ, పొన్ముడి రాజీనామా చేయడంతో రెండు మంత్రి పదవులు ఖాళీ కాగా, అనూహ్యంగా మనో తంగరాజ్‌కు అవకాశం లభించింది. ఇదిలా వుండగా 2021 మేలో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకూ మొత్తం ఆరుసార్లు ఆయన మంత్రివర్గంలో మార్పులు చేర్పులు జరిగినట్లయింది. అదే విధంగా స్టాలిన్ మంత్రివర్గం 33కు తగ్గినట్లయింది.

రెండుసార్లు మంత్రి పదవి కోల్పోయిన సెంథిల్ బాలాజీ, పొన్ముడి

2021లో డీఎంకే అధికారంలోకి వచ్చాక కె.పొన్ముడి, వి.సెంథిల్ బాలాజీ రెండుసార్లు మంత్రి పదవులను కోల్పోయినట్లయింది. అక్రమార్జన కేసుకు సంబంధించి 2023 డిసెంబరులో మద్రాస్ హైకోర్టు పొన్ముడికి మూడేళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో ఆయన మంత్రి పదవిని కోల్పోయారు. అప్పుడు ఆయన దగ్గరున్న విద్యాశాఖ బాధ్యతలను మంత్రి రాజకన్నప్పన్‌కు కేటాయించారు. ఆ తరువాత సుప్రీంకోర్టు వెసులుబాటు కల్పించడంతో 2024 మార్చిలో పొన్ముడి మళ్లీ మంత్రి పదవి స్వీకరించారు అయితే ఆయనకు ముందులాగే ఉన్నత విద్యాశాఖను కేటాయిస్తారని అందరూ భావించినా సీఎం మాత్రం అటవీ శాఖ కేటాయించారు. ఈ నేపథ్యంలో పొన్ముడి మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి సీఎం అసంతృప్తికి గురై, మంత్రి పదవి పోగొట్టుకున్నారు. అదే విధంగా అక్రమార్జన కేసులో ఈడీ అరెస్టు చేయడంతో సెంథిల్ బాలాజీ 2024 ఫిబ్రవరి 12న మంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పుడు ఆయన వద్దనున్న విద్యుత్ శాఖను మంత్రి తంగం తెన్నరసుకు అదనంగా ఎక్సయిజ్ శాఖను మంత్రి ముత్తుస్వామికి కేటాయించారు. ఆ తరువాత బెయిల్ రావడంతో సెంథిల్ బాలాజీ మళ్లీ గత ఏడాది సెప్టెంబరు 28న మంత్రివర్గంలో చేరారు. కానీ సుప్రీంకోర్టు జోక్యంతో ఆయన మళ్లీ మంత్రి పదవిని వదులుకోవాల్సివచ్చింది.

పరువు హత్యకేసులో

13 మందికి యావజ్జీవ శిక్ష ఖరారు

● సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు



సుప్రీం కోర్టు - మృతులు మురుగేశన్-కన్నగి (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో కులాంతర వివాహం చేసుకున్న ప్రేమజంటను దారుణంగా హతమార్చిన 13 మంది నిందితులకు కింది కోర్టు విధించిన యావజ్జీవ జైలుశిక్షను సుప్రీంకోర్టు ఖరారు చేస్తూ సంచలనాత్మక తీర్పుచెప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కడలూరు జిల్లా విరుదాచలం సమీపంలో దళితవర్గానికి చెందిన సామికన్ను కుమారుడు మురుగేశన్ (25), అదే ప్రాంతంలోని మరో కులానికి చెందిన దురైస్వామి కుమార్తె కన్నగి (22) ప్రేమించుకున్నారు. పెద్దలకు తెలియకుండా ఆ జంట 2003 మే 5వ తేదీ కడలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. విల్లుపురం జిల్లా ముంగిల్‌దురైక్కాడు ప్రాంతంలో తమ బంధువుల ఇంట్లో కన్నగిని అప్పగించిన మురుగేశన్.. శ్రీముష్ణం సమీపంలోని వన్నంగుడికాడు ప్రాంతంలోని బంధువుల ఇంట్లో ఉండేవాడు. ఈ నేపథ్యంలో, కన్నగి కనిపించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా జాడతెలియలేదు. ఇదిలా వుండగా, కులాంతర వివాహం చేసుకున్న విషయం కన్నగి కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో మురుగేశన్ చిన్నాన్న అయ్యాస్వామి ద్వారా 2003 జూలై 8వ తేదీ ప్రేమజంటను ఇంటికి పిలిపించిన దురైస్వామి.. వారిని ఆ ప్రాంతంలో వున్న ఓ శ్మశానవాటికకు తీసుకెళ్ళి చేతులు, కాళ్ళు కట్టేసి బలవంతంగా చెవులు, నోట్లో విషం ఇంజక్షన్ వేసి హతమార్చారు. ఆ తర్వాత ఆ రెండు మృతదేహాలను వేర్వేరుగా దహనం చేశారు. దీనిపై మురుగేశన్ తల్లిదండ్రులు విరుదాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో సీఐగా ఉన్న చెల్లముత్తు (66), ఎస్సై తమిళ్‌మార్లు ఈ పరువు హత్యను దాచేందుకు ప్రయత్నించారు. దీంతో కొన్నిరోజుల అనంతరం మళ్ళీ మురుగేశన్-కన్నగి పరువు హత్య గురించి సోషల్ మీడియాలో కథనం రావడంతో విరుదాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో రెండు కుటుంబాల నుంచి తలా నలుగురిని అరెస్టు చేశారు. అనంతరం జరిగిన పరిణామాలతో ఈ కేసును సీబీఐకి మార్చారు. 2009, మార్చి 3న సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. అందులో కన్నగి-మురుగేశన్ పరువు హత్యకు గురయ్యారని, 13 మందికి ఈ హత్యలతో సంబంధముందని పేర్కొంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కడలూరు జిల్లా సెషన్స్ కోర్టు కన్నగి సోదరుడు మరుదుపాండి (49)కి ఉరిశిక్ష, రూ.4.65 లక్షల జరిమానా, ఆమె తండ్రి సహా బంధువులకు యావజ్జీవ జైలుశిక్ష, పరువు హత్యను దాచేందుకు యత్నించిన చెల్లముత్తు, తమిళ్‌మార్ పోలీసు అధికారులకు యావజ్జీవ, తలా రూ.1.15 లక్షల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పువెలువరించింది. ఈ తీర్పుకు వ్యతిరేకంగా ఆ 13 మంది మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌పై 2022 జూన్‌లో విచారణ జరిపిన న్యాయస్థానం ఈ కేసులో కన్నగి సోదరుడికి విధించిన ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా తగ్గిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కన్నగి తండ్రి, పోలీసు అధికారులు సహా 12 మందికి విధించిన యావజ్జీవ శిక్షను మద్రాస్ హైకోర్టు నిర్ధారించింది. అయితే ఆ తీర్పును కూడా నిందితులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై సుదీర్ఘ విచారణ అనంతరం హైకోర్టు ఇచ్చిన తీర్పును ఖరారు చేస్తూ అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. దీని పట్ల పలు దళిత సంఘాలు, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఈపీఎస్‌కు కేంద్ర బలగాల భద్రత

● గవర్నర్‌కు అన్నాడీఎంకే వినతి




ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధినేత, అసెంబ్లీ ప్రతిపక్షనేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని గవర్నర్‌కు అన్నాడీఎంకే విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అన్నాడీఎంకే సోమవారం గవర్నర్‌కు వినతిపత్రం పంపించింది. సేలంకు చెందిన అన్నాడీఎంకే న్యాయవాది మణికంఠన్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ... ఎడప్పాడిని వీఐపీ జాబితాలో చేరుస్తూ కేంద్ర బలగాలతో సెక్యూరిటీ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై పరిశీలిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని వివరించారు.

అక్రమార్జన

కేసు వ్యవహారం

● మంత్రి ఐ.పెరియస్వామికి ఎదురుదెబ్బ

● దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు రద్దు చేసిన హైకోర్టు



మంత్రి ఐ.పెరియస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసు నుంచి మంత్రి ఐ.పెరియస్వామి సహా ఆయన భార్య, ఇద్దరు కుమారులను విడుదల చేస్తూ దిండుగల్ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. 2006వ సంవత్సరం నుండి 2010 వరకు రెవెన్యూ, న్యాయ, జైలు, గృహవసతిశాఖ మంత్రిగా ఐ.పెరియస్వామి వ్యవహరించారు. ఆ సమయంలో ఆదాయానికి మించి రూ.2 కోట్ల 1లక్షా, 35వేలు అదనంగా కూడబెట్టుకున్నారన్న కారణంగా అవినీతి నిరోధక శాఖ పోలీసులు మంత్రితో పాటు ఆయన భార్య సుశీల, కుమారులు సెంథిల్‌కుమార్, ప్రభులపై కేసు నమోదు చేశారు. ఈ కేసుపై దిండుగల్ ప్రత్యేక కోర్టు విచారణ జరిపింది. ఈ కేసులో దాఖలు చేసిన ఛార్జిషీటులో తమకు వ్యతిరేకంగా ఆరోపించిన నేరాలకు ఆధారాలు లేవంటూ పెరియస్వామి తరుపున పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు మంత్రి ఐ.పెరియస్వామి సహా నలుగురినీ విడుదల చేస్తూ తీర్పునిచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ 2018లో మద్రాస్ హైకోర్టులో ఏసీబీ అప్పీలు పిటిషన్ వేసింది. ఈ కేసు విచారణ సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్ ముందు విచారణకు వచ్చింది. ఏసీబీ, పిటిషనర్ న్యాయవాదుల వాదనల అనంతరం మంత్రి ఐ.పెరియస్వామి, ఆయన భార్య, ఇద్దరు కుమారులను విడుదల చేస్తూ కింది కోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. అంతేకాకుండా ఈ అక్రమార్జన కేసు సుదీర్ఘకాలంగా పెండింగులో వున్నందువల్ల ప్రతిరోజు విచారణ జరిపి, ఆరు నెలల్లోగా తీర్పు చెప్పాలని దిండుగల్ న్యాయస్థానాన్ని ఆదేశించారు.

రాష్ట్రంలో మత ఉగ్రవాదాన్ని సహించబోం

● అసెంబ్లీలో సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ఉగ్రవాదం ఏ రూపంలో వున్నా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. శాసనసభలో సోమవారం ఉదయం హోంశాఖ నిర్వర్తిస్తున్న స్టాలిన్ పోలీసు, అగ్నిమాపక శాఖకు సంబంధించిన ప్రతిపాదనలు చేసి ప్రసంగించారు.

రాష్ట్రంలో మహిళల భద్రతకు భరోసా లేదని, మతపరమైన ఘర్షణలు అధికం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ డిమాండ్ చేశారు. న్యాయశాఖ మంత్రి రఘుపతి, సీనియర్ మంత్రి దురైమురుగన్ జోక్యం చేసుకుని దేశంలోనే మహిళలకు పటిష్టమైన భద్రత కలిగిన రాష్ట్రం తమిళనాడేనని, ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే నేరాల సంఖ్య కూడా తక్కువేనని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ జోక్యం చేసుకుని వానతి శ్రీనివాసన్ ఆడిటర్ రమేష్ హత్య విషయాన్ని ప్రస్తావించారని, ఆ సంఘటన అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో జరిగిందని, ఆ హత్యకేసుపై ఇంకా విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఇక కశ్మీర్‌లోయలో జరిగిన ఉగ్రవాద కార్యకలాపాలు రాష్ట్రంలో జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని వానతి శ్రీనివాసన్ కోరటం వింతగా ఉందన్నారు. రాష్ట్రంలో మత ఉగ్రవాదం అడుగుపెట్టనివ్వకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తమ ప్రభుత్వం ఏ మాత్రం వెనుకాడదన్నారు. కశ్మీర్ లోయలో జరిగిన మారణకాండపై పార్లమెంట్‌లో చర్చలు జరుపుతున్నప్పుడు కేంద్ర ప్రభుత్వ భద్రతా లోపమని డీఎంకే ఎంపీలు ఎవరూ ఆరోపించలేదని, ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్రానికి అండ గా ఉంటమాని భరోసా ఇచ్చిన సంగతిని వానతి శ్రీనివాసన్ గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్నటికీ మత ఉగ్రవాదం ప్రవేశించే అవకాశమే లేదని, అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటే సంతోషిస్తానని స్టాలిన్ అన్నారు.

మా పాలనలోనే పోలీసులకు ఎన్నో పథకాలు...

పోలీసు, అగ్నిమాపక శాఖలకు డీఎంకే ప్రభుత్వం ప్రకటించిన హామీలను ఎంతవరకు నెరవేర్చిందో చెప్పాలని అన్నాడీఎంకే సభ్యుడు ఓ.ఎస్.మణియన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పుడల్లా పోలీసులు, అగ్నిమాపక శాఖకు ఎన్నో పథకాలు అమలు కావటం ఆనవాయితీగామారిందని, గత మూడేళ్లుగా తమ ప్రభుత్వం కూడా ఈరెండు శాఖలకు ఎన్నో పథకాలను అమలు చేసిందని ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. ప్రాణాంతకమైన వ్యాధులతో బాధపడేవారికి పోలీసు సంక్షేమనిధి నుండి చెల్లించే ఆర్థికసహాయాన్ని రూ.4లక్షల నుండి రూ.8లక్షలకు పెంచామని, అందే కాకుండా టెన్త్, ఇంటర్‌లో మెరిట్ సాధించిన పోలీసుల పిల్లలకు ఇచ్చే నగదు కానుకలను కూడా పెంచినట్లు చెప్పారు. తన ప్రభుత్వ హాయంలోనే 2249 మందికి కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగాలిచ్చామని తెలిపారు. ఇలా పోలీసులు, అగ్నిమాపక దళానికి తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసి, ఎన్నో వరాలను కూడా ప్రకటించిందన్నారు.



శాసనసభలో పోలీస్, అగ్నిమాపక శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలు చేయనున్న సందర్భంగా సచివాలయంలో సీఎం స్టాలిన్‌ను కలుసుకున్న డీజీపీ శంకర్‌జివాల్, హోంశాఖ అధనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, అగ్నిమాపక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీమా అగర్వాల్, సిటీ పోలీసు కమిషనర్ అరుణ్ తదితరులు

సమాచార దర్శిని

టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఓఎంఆర్ షీట్లు

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) నిర్వహించిన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లను వెబ్‌సైట్‌లో ఉంచింది. 2022 సెప్టెంబరు 10వ తేదీ నిర్వహించిన గ్రూపు-7బి, 2022 సెప్టెంబరు 11వ తేదీన నిర్వహించిన గ్రూపు-8 పరీక్షలు, 2023 జనవరి 28న నిర్వహించిన గ్రూపు-3ఏ పరీక్షలు తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లను "www.tnpsc.com' అనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు పేర్కొంది.

30న దివ్యాంగుల గ్రీవెన్స్

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేదీ దివ్యాంగుల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్టు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి రాజాజీ సాలైలో ఉన్న జిల్లా కలెక్టరేట్‌లో ఈ గ్రీవెన్స్ డే జరుగుతుందని, ఇందులో చెన్నై జిల్లాకు చెందిన దివ్యాంగులు పాల్గొని తమ సమస్యలకు సంబంధించి వినతులను సమర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రంలో 73 మంది శతాధిక వృద్ధులకు పింఛన్

పెరంబూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వందేళ్లు దాటిన 73 మంది పింఛన్ పొందుతున్నారని ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. శాసన సభ సమావేశాల్లో శనివారం ఆర్థిక, పర్యావరణ శాఖ పద్దులపై జరిగిన చర్చలో ఆర్థిక మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో 7.12 లక్షల మంది పింఛన్ పొందుతున్నారని తెలిపారు. వీరిలో వందేళ్లు దాటిన వారు 73 మంది ఉన్నారని చెప్పారు. నాగపట్టణంకు చెందిన 108 ఏళ్ల గోపాలకృష్ణన్, తిరుకోవిలూర్‌కు చెందిన 107 ఏళ్ల ఆరోగ్య మేరి తదితరులు పింఛన్ పొందుతున్నారన్నారు. వారు ఇంకా చాలా సంవత్సరాలు జీవించి మమ్మల్ని ఆశీర్వదించాలని మంత్రి కోరారు.

వేసవి రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తాంబరం-పోతనూరు మధ్య నడుపుతున్న ప్రత్యేక రైలు సేవలు జూన్ 8వ తేదీ వరకు కొనసాగుతాయని దక్షిణ రైల్వే ప్రకటించింది. వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని నడుపుతున్న ఈ ప్రత్యేక రైలుకు ప్రయాణికుల ఆదరణ పెరగడంతో మరో నెల రోజుల పాటు నడపాలని నిర్ణయించారు. ఆ మేరకు తాంబరం నుండి పోతనూరుకు మే 9,16,23,30 జూన్ 6వ తేదీల్లో 06185 అనే నెంబరు గల రైలును నడుపుతారు. మరు మార్గంలో పోతనూరు నుంచి తాంబరంకు మే 11,18,25 జూన్ 1,8వ తేదీల్లో 06186 నెంబరు రైలు నడుపుతారు. అదే విధంగా బెంగళూరు-మదురై మధ్య నడిపే ప్రత్యేక రైలు టైంటేబుల్ విడుదలైంది. బెంగళూరు నుంచి బుధవారం రాత్రి 7 గంటలకు బయలుదేరే 06521 నెంబరు రైలు మరుసటి రోజు ఉదయం 6.15 గంటలకు మదురై చేరుకుంటుంది. మదురై నుంచి మే 1వ తేదీ ఉదయం 9.10 గంటలకు బయలుదేరే ప్రత్యేక రైలు రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలుకు సోమవారం నుండి రిజర్వేషన్ ప్రారంభమైనట్లు రైల్వే అధికారులు తెలిపారు.

12.30వరకే అంగన్వాడీ కేంద్రాలు

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వున్న అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పనిచేయాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2022- 2023వ విద్యా సంవత్సరం నుండి పంచాయతీ ప్రాథమిక, మాధ్యమిక ప్రాంగణాల్లో ఉన్న 2,381 అంగన్వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించింది. ఐదేళ్లలోపు చిన్నారులు చదువుకుంటున్న ఈ కేంద్రాల పని గంటలను ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కుదిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

3న డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం మే 3న జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశం తేనాంపేటలో డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలోని కలైంజర్ అరంగంలో పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శులందరూ తప్పకుండా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ సైనికులకు వృత్తి శిక్షణ తరగతులు

వేలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మాజీ సైనికుల కోసం ప్రత్యేక శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఏలగిరి హాలులో దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ ఆర్‌పీ వేలు తదితరులు కూడా పాల్గొన్నారు.

కుంద్రత్తూరు, మాంగాడు ప్రాంతాల్లో

30 మంది బంగ్లాదేశీయుల అరెస్టు



బంగ్లాదేశీయులు బసచేస్తున్న సామాజిక కేంద్ర భవనం

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కుంద్రత్తూరు, మాంగాడు ప్రాంతాలలో వీసా లేకుండా ఉంటున్న 30 మంది బంగ్లాదేశీయులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో బంగ్లాదేశీయులు వీసా లేకుండా ఉంటున్నారనే సమాచారం మేరకు ఢిల్లీ పోలీసులు ఆగమేఘాలపై వచ్చి ఆ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అరెస్టయిన 30 మందిని కొల్లపాక్కం ప్రాంతంలో ఉన్న సామాజిక కేంద్ర భవనంలో బసకల్పించి విచారణ జరుపుతున్నారు. యేళ్ల తరబడి వీరంతా రహదారుల్లోని ప్లాస్టిక్, ఇనుప వస్తువులు సేకరించి అమ్ముతున్నారని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఇక వీరిలో ఎవరైనా తీవ్రవాద సంస్థల సానుభూతిపరులు ఉన్నారా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

భార్య మందలించిందని

భర్త ఆత్మహత్య

తిరుత్తణి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భార్య మందలించడంతో ఉరేసుకుని భర్త మృతిచెందిన ఘటన తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే తిరువళ్లూరు జిల్లా ఆర్‌కేపేటలోని పైవలస గ్రామంలో ముత్తు (36) తన భార్య సుధ (32)తో కలిసి ఇటుకల బట్టీలో కూలి పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసైన ముత్తు పనికి సరిగ్గా వెళ్లకపోవడంతో తరచూ ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ముత్తు మద్యం సేవించి ఇంటికి రాగా, దీంతో అతడి భార్య మద్యం తాగొద్దని గట్టిగా మందలించింది. దీంతో రాత్రంతా వారిద్దరికి వాగ్వాదం జరిగింది. మరుసటిరోజు తెల్లవారుజామున ముత్తుని నిద్రలేపుదామని గది తలుపులు తట్టగా, ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు బద్దలు కొట్టి వెళ్ళి చూడగా, ముత్తు ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేల్లాడుతూ కనిపించాడు. దీంతో హుటాహుటిన షోలింగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకొని ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చర్యలు చేపట్టారు.

కొడనాడు హత్యకేసులో

జయ సహాయకుడికి సమన్లు



పూంగుంద్రన్

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత వేసవి విడిది కేంద్రం కొడనాడు ఎస్టేట్‌లో 2017లో జరిగిన వాచ్‌మన్ హత్య, దోపిడీ కేసుల విచారణలో భాగంగా ఆమె సహాయకుడు పూంగుంద్రన్‌కు సీబీసీఐడీ పోలీసులు సమన్లు పంపించారు. ఏడీఎస్పీ మురుగవేల్ నేతృత్వంలో పోలీసులు ఇప్పటివరకు 250 మంది సాక్షులను విచారించారు. ఈ నేపథ్యంలో జయలలిత సహాయకుడు పూంగుంద్రన్‌ను మే 6న విచారణకు హాజరుకావాలని సీబీసీఐడీ పోలీసులు సమన్లు పంపించారు. 2022లో తొలిసారి పూంగుంద్రన్‌ను విచారణ జరిపారు. ప్రస్తుతం రెండో సారి విచారణ జరిపేందుకు సీబీసీఐడీ పోలీసులు సిద్ధమవుతున్నారు.

అక్రమంగా గంజాయి నిల్వ

● ముగ్గురి అరెస్టు

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్టణం నుంచి రైలులో గంజాయి స్మగ్లింగ్ చేసి ఇంటిలో అక్రమంగా నిల్వవుంచిన కేసులో ఇద్దరు మహిళల సహా ముగ్గురిని నాగపట్టణం పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.6 లక్షలు విలువైన 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అరెస్టు చేసిన వారిని నాగపట్టణం వెళిపాళెయం నాడార్ వీధికి చెందిన ప్రకాష్, ఈయన భార్య రేణుక, రేవతిగా గుర్తించారు.

విద్యుదాఘాతానికి ఇద్దరి మృతి

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. జిల్లాలోని వీరనల్లూరు సమీపంలోని తిరుప్పుడైమరుదూరులో విద్యుదాఘాతంతో ఓ మహిళ చనిపోయారు. మృతురాలిని ఇసైక్కి అమ్మాళ్ (38)గా గుర్తించారు. అలాగే, ఇదే జిల్లాలోని వీరవనల్లూరు గ్రామానికి చెందిన వేలు (90) అనే వృద్ధుడు కూడా విద్యుదాఘాతానికి మరణించాడు. తన ఇంటిలో ఇనుప చువ్వకు దుస్తులను ఆరేస్తుండగా, కరెంట్ షాక్ తగలడంతో చనిపోయాడు. ఈ రెండు ఘటనలపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

డీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం



వేలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు ఉపశమనాన్ని కలిగేలా వేలూరు బస్టాండు ప్రాంతంలో సోమవారం ఉదయం జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆ పార్టీ నేతలు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ కదిర్ ఆనంద్ చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు బత్తాయి, పుచ్చకాయ ముక్కలు, మజ్జిగ పంపిణీ చేశారు.


రూ.50 లక్షల బీడీ ఆకు స్వాధీనం

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి, తూత్తుక్కుడి సముద్రతీర ప్రాంతాల మీదుగా శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రూ.50 లక్షల విలువైన బీడీ ఆకులను కోస్తాతీర గస్తీదళం, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఐదుగురిని అరెస్టు చేశారు. కోస్తా తీర జిల్లాల మీదుగా భారీగా బీడీ ఆకులు అక్రమంగా రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సముద్రతీర గస్తీదళంతో కలిసి పోలీసులు నిఘా వేశారు.. ఈ నేపథ్యంలో కూడన్‌కుళం మీదుగా బీడీ ఆకులను తరలిస్తున్నట్టు తెలియడంతో అప్రమత్తమైన పోలీసులు.. ఆ ప్రాంతంలో నిఘా వేసి అటుగా వచ్చిన లారీని ఆపి తనిఖీ చేయగా, అందులో బీడీ ఆకులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి జానా, షణ్ముగం, సంతోష్ కుమార్, ముత్తుకుమార్‌తో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న బీడీ ఆకుల విలువ రూ.50 లక్షలుంటాయని పోలీసులు వెల్లడించారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌లో 537 వినతులు

వేలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మికి ప్రజలు 537 వినతులు అందించారు. పింఛన్, ఇళ్ల పట్టాలు, తదితర అంశాలకు సంబంధించి వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేశారు.

పాక్ జలసంధి వద్ద తీరానికి కొట్టుకొస్తున్న జెల్లీ చేపలు



రామేశ్వరం తీరంలో ఉన్న జెల్లీ చేపలు

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపం పాక్‌జలసంధి ప్రాంతం వద్ద గత రెండు రోజులుగా జెల్లీ చేపలు తీరానికి కొట్టుకురావటంతో జాలర్లు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ జెల్లీ చేపలను తాకితేనే చర్మవ్యాధులు వస్తాయని, దురదలు అధికమవుతాయని జాలర్లు చెబుతున్నారు. సోరంకోట్టై నుండి కోదండరామాలయం ఎదురుగా ఉన్న తీరం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఈ జెల్లీ చేపలు వేల సంఖ్యలో పడి ఉన్నాయని జాలర్లు చెబుతున్నారు. ఇప్పటికే ఈ జెల్లీ చేపల వల్ల సుమారు యాభై మందికిపైగా జాలర్లు దురదలతో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ జెల్లీ చేపలపై మత్స్య పరిశోధకులు పరీక్షలు జరపాలని జాలర్లు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో 77 మంది జడ్జీల బదిలీ

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 77 మంది న్యాయమూర్తులను బదిలీ చేస్తూ మద్రాస్ హైకోర్టు చీఫ్ రిజిస్ట్రార్ అల్లి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలో కలకలంరేగెత్తించిన అత్యాచారం కేసుపై విచారణ జరిపిన కోవై మహిళా కోర్టు న్యాయమూర్తి నందినీదేవి, కరూర్ కుటుంబ సంక్షేమ కోర్టుకు బదిలీ అయ్యారు. పూందమల్లిలో బాంబు పేలుళ్ల కేసుపై విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఇళలగన్ కరూర్ జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. చెన్నై సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించిన ఎళిల్‌వేలన్ సేలం జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

మెదడు నిర్జీవమైన యువకుడి

అవయవాల దానం

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్‌లోని శ్రీలంక శరణార్థుల శిబిరంలో ఆశ్రయం పొందుతూ మెదడు నిర్జీవమైన ఓ యువకుడి అవయవాలను రాష్ట్ర ఆరోగ్యశాఖకు కుటుంబ సభ్యులు దానం చేసి మానవత్వం చాటుకున్నారు. పుళల్ కావంగరై ప్రాంగణంలో వున్న శ్రీలంక శరణార్థుల శిబిరంలో ఆశ్రయం పొందుతున్న రాజేశ్వరన్ కుమారుడు రాజసింగం (41) గత వారం రెడ్‌హిల్స్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో అతడిని ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స కొనసాగిస్తున్న నేపథ్యంలో శనివారం రాజసింగం మెదడు నిర్జీవమైందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడి అవయవాలను ప్రభుత్వ ఆరోగ్య శాఖకు దానంగా అందజేశారు. మాధవరం తాహసీల్దార్ రెవెన్యూ అధికారులు రాజసింగం భౌతికకాయానికి ప్రభుత్వం తరుపున అంజలి ఘటించారు. 1990వ సంవత్సరం శ్రీలంకలో ఎల్‌టీటీఈ-మిలటరీ బలగాల మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో ఆ దేశం నుంచి వేలాది మంది తమిళులు శరణార్థులుగా రాష్ట్రానికి తరలివచ్చారు. వీరికి రాష్ట్రప్రభుత్వం ఆశ్రయం కల్పించడంతో పాటు వారి పిల్లలు చదువుకునేందుకు, మహిళలకు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఆ రీతిలో వచ్చి పుళల్ ప్రాంతంలో నివసిస్తున్న రాజసింగంకు షర్మిలాదేవి అనే భార్య, అనన్య (7), సాధన (6) అనే పిల్లలున్నారు.

5కిలోల గంజాయి రవాణా

● ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

వేలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని కాట్పాడి రైల్వేస్టేషన్ సమీపంలో చట్టవిరుద్ధంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే వేలూరు-బెంగళూరు నేషనల్ హైవేలో ఉన్న చెక్‌పోస్టులో సోమవారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అతివేగంగా వస్తున్న ఓ కారును ఆపి, తనిఖీ చేశారు. అందులోవున్న 5.5 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని, రవి, విమల్ అనే వారిని అరెస్టు చేశారు. విచారణలో వీరు ముంబయిలోని ఓ వ్యక్తి నుండి గంజాయిని కొనుగోలు చేసి, కళాశాలల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లుగా తెలిసింది. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

సుశీంద్రన్ ఆలయంలో చిత్తిరై వేడుకలు ప్రారంభం

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాల్లో ఒకటైన సుశీంద్రన్ ఆలయంలో చిత్తిరై వార్షిక వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ధ్వజారోహణం చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 4 గంటలకు మూలవిరాట్టు గణపతిని మూషిక వాహనంలో, రాత్రి 8 గంటలకు పూంగోయిల్ వాహనంలో ఊరేగించనున్నారు. పదో రోజు జరిగే వేడుకల్లో రాత్రి 8 గంటలకు విద్యుద్దీపాలంకరణ చేసిన తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేశారు.

వీఎంఆర్ స్మారక భవనం ప్రారంభం



వేలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా రంగాపురంలో సోమవారం వీఎంఆర్ జ్ఞాపకార్థం ఇల్లమ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో స్మారక భవన ప్రారంభోత్సవం జరిగింది. అనంతరం వీఎంఆర్ చిత్రపటానికి పూలమాలవేసి సభ్యులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నటరాజన్, జనరల్ సెక్రటరీ షణ్ముగం, కార్యదర్శి రమేష్, మండల అధ్యక్షులు మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధార్

రెన్యువల్ చేయాలి

● జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థుల ఆధార్ రెన్యువల్ చేయాలని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఎస్.కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమార్థం ఆధార్ నమోదు పథకం కింద 2024-2025వ విద్యా సంవత్సరంలో జూన్ నుంచి అన్ని పాఠశాలల్లో ఆధార్ రెన్యువల్ కార్యక్రమం జరగనుంది. 5 నుండి 17ఏళ్ళ వరకు ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా ఆధార్ రెన్యువల్ చేసుకోవాల్సివుంటుంది. ప్రభుత్వం-ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ రెన్యువల్‌ను బయోమెట్రిక్ ద్వారా ఈ వేసవి సెలవుల్లో నమోదు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఈసేవా కేంద్రాలు, పోస్టాఫీస్, తహసీల్దార్ కార్యాలయాలకు విద్యార్థుల ఆధార్ రెన్యువల్‌పై సర్క్యులర్ జారీ చేయాల్సిందిగా కన్నప్పన్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పొన్ముడికి మంత్రి పదవి కోసం

కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం



ధర్నాలో మోటారు బైకును దగ్ధం చేస్తున్న డీఎంకే కార్యకర్త

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూరులో పొన్ముడికి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ బజారు వీధిలో డీఎంకే నాయకులు కార్యకర్తలు సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఆ సందర్భంగా డీఎంకే కార్యకర్త గుణా తన బైకుకు నిప్పంటించారు. అదే సమయంలో తిరువెన్నైనల్లూరు నగర పంచాయతీ 15వ వార్డు కౌన్సిలర్ భాగ్యరాజ్ కిరోసిన్ వంటిపై పోసుకుని నిప్పంటించుకున్నారు. వెంటనే పార్టీ కార్యకర్తలు అడ్డుకుని కాపాడారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి గాయపడిన భాగ్యరాజ్‌ని చికిత్స నిమిత్తం ముండియంబాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు.

అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి



తిరుత్తణి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎదగాలంటే చదువు ఎంతో ముఖ్యమని, వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పాఠశాల చైర్మన్ నరసింహ భారతి విద్యార్థులకు ఉద్బోధచేశారు తిరుత్తణి సమీపంలోని ఆర్‌కే పేట అరుంత్‌సాయి వెట్రి విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల తృతీయ వార్షికోత్సవాన్ని ఆ పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి సారథ్యంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు రంగనాథన్, విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివశక్తి గోపాల్, శశికళా గోపాల్, సునీల్‌కుమార్, భూపాల్, పన్నీర్‌సెల్వం తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న వేసవి తాపం

● ఆస్పత్రుల్లో అదనపు వార్డులు

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు పెరిగిపోతున్నాయి. దీంతో అనేక మంది వేసవితాపానికి గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు వార్డులను ఏర్పాటు చేయనున్నట్టు ఆరోగ్య శాఖా మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం వెల్లడించారు. సైదాపేట సెగ్మెంట్ 140వ వార్డు పరిధిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు పెరిగిపోతున్నాయన్నారు. దీంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు తీవ్ర అస్వస్థతకు లోనవుతున్నారన్నారు. అందువల్ల పగటిపూట బయటకు వెళ్ళవద్దని ఆయన కోరారు. ఇదే విషయంపై ఆరోగ్య కార్యకర్తలు కరపత్రాలతో ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. అంతేకాకుండా వేసవి తాపానికి గురయ్యే వారికి వెంటనే చికిత్స అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు వార్డులను ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు.

విమానం బ్రేక్ వ్యవస్థ ఫెయిల్

● చాకచక్యంగా ల్యాండింగ్

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఖతార్ దేశ రాజధాని దోహా నుంచి చెన్నై వచ్చిన విమానానికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అయితే, పైలెట్ చాకచక్యంగా ఈ విమానాన్ని ల్యాండింగ్ చేయించారు. దోహా నుంచి 15 మంది సిబ్బంది, 314 మంది ప్రయాణికులతో ఖతార్ ఎయిర్‌లైన్స్ విమానం సోమవారం వేకువజామున 2.40 గంటల ప్రాంతంలో చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అయితే, విమానం కిందకు దిగే సమయంలో బ్రేకింగ్ వ్యవస్థలో లోపాన్ని పైలెట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలెట్లు సమయస్ఫూర్తిగా వ్యహరించి విమానాన్ని చాకచక్యంగా కిందికి దించారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యేంతవరకు ఎయిర్‌పోర్టులో టెన్షన్ వాతావరణం నెలకొంది.

హెల్మెట్ లేని వారి నుంచి

రూ.8.28 కోట్ల అపరాధం వసూలు

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీస్ పరిధిలో గత యేడాది హెల్మెట ధరించని ద్విచక్రవాహనదారుల నుంచి రూ.8.28 కోట్ల అపరాధం వసూలు చేసినట్టు నగర పోలీస్ కమిషనరేట్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 11.44 లక్షల కేసులను నమోదు చేసామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు 60 సిగ్నెల్స్‌లో 77 ఆటోమేటిక్ కెమెరాలను అమర్చినట్టు తెలిపింది. అలాగే, వన్‌వేలో ప్రయాణం, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం, ద్విచక్రవాహనంలో ముగ్గురు ప్రయాణించడం వంటివి ఈ ఆటో కెమెరాలు ఎప్పటికప్పుడు రికార్డ్ చేస్తున్నాయన్నారు. అలాగే, ఈ-చలాన్‌కు సంబంధించి వివరాలు అందించేందుకు వీలుగా 12 సేవా సెంటర్లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

పొల్లాచ్చి అత్యాచారాల కేసుపై 13న తీర్పు

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించిన 'పొల్లాచ్చి సామూహిక అత్యాచారాల కేసుపై మే 13న తీర్పు వెలువడనుంది. ఈ అత్యాచారాలకు సంబంధించి 2019లో వెలువడిన ఓ ఆడియో, వీడియోలో యువతులను చిత్రహింసలు పెట్టి కొంతమంది యువకులు అత్యాచారాలకు పాల్పడే దృశ్యాలు, యువతులను బెల్టులతో కొడుతున్న దృశ్యాలున్నాయి. ఆ వీడియో ఆధారంగా పోలీసులు విచారణ జరిపారు. ఈ అత్యాచారాల కేసులో పొల్లాచ్చికి చెందిన అన్నాడీఎంకే నేతల కుమారులు నిందితులనే వార్తలు కూడా వెలువడ్డాయి. ఈ కేసులో శబరిరాజన్, తిరునావుక్కరసు, సతీష్‌కుమార్, వసంతరాజన్, మణివన్నన్, అరుళానందం, బాబు, అరుణకుమార్ సహా తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ బాధ్యతలను సీబీఐకి అప్పగించారు. కోయంబత్తూరు మహిళా కోర్టు ఈకేసుపై విచారణ జరిపింది. మొత్తం 50 మంది సాక్ష్యం చెప్పారు. 200కుపైగా దస్తావేజులు, 40కి పైగా ఎలక్ట్రానిక్ ఆధారాలు సమర్పించారు.ఈ కేసుకు సంబంధించి అన్ని పక్షాల వాదనలు పూర్తవటంతో మే 13న తీర్పు వెలువరించనున్నట్లు మేజిస్ట్రేట్ నందిని దేవి ప్రకటించారు.

కుమరిలో కొత్త అంబులెన్స్ సేవలు



కొత్త అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ విజయ్ వసంత్

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో కొత్త అంబులెన్స్ సర్వీసును కాంగ్రెస్ ఎంపీ విజయ్‌వసంత్ ప్రారంభించారు. యువజన కాంగ్రెస్ స్థానిక ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఈ అంబులెన్స్ ప్రజలకు సేవలందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కులచ్చల్ శాసనసభ్యుడు ప్రిన్స్, కన్నియాకుమారి ఈస్ట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేటీ ఉదయం తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన

జపాన్ రాయబారి



జపాన్ రాయబారికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత్‌లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది ఆయన మొట్టమొదటి శ్రీసిటీ పర్యటన. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహాషి మునియో, ఇతర అధికారులతో కలిసి విచ్చేసిన జపాన్ రాయబారి బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. తొలిసారి శ్రీసిటీ సందర్శనే తొలి అజెండాగా జపాన్ రాయబారి ఇక్కడకు రావడం తమకు గర్వంగా ఉందని రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. శ్రీసిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సాధించిన విజయాలు, ప్రగతిని వారికి వివరిస్తూ దేశంలోనే జపాన్ పరిశ్రమలకు రెండో అతిపెద్ద పెట్టుబడి కేంద్రంగా శ్రీసిటీ ఆవిర్భవించిందని తెలిపారు. శ్రీసిటీ అభివృద్ధి, వ్యాపార అవకాశాలకు సంబంధించిన పలు అంశాలపై జపాన్ రాయబారి ఒనో కెయిచి చర్చలు జరిపారు. జపాన్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో కీలక పాత్ర వహించడంతో పాటు ఇండో - జపాన్ ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో శ్రీసిటీ చురుకైన పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. శ్రీసిటీలోని వివిధ జపాన్ పరిశ్రమలకు చెందిన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శ్రీసిటీలోని వ్యాపార అనుకూల వాతావరణం, యాజమాన్య సహకారం పట్ల సంతృప్తి చేసిన జపాన్ పరిశ్రమల ప్రతినిధులు, పలు అభిప్రాయాలను, సూచనలను రాయబారితో పంచుకున్నారు. అనంతరం డైకిన్, యూనిచార్మ్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు ఇతర కార్యకలాపాలను పరిశీలించారు.



ఆడియో రిలీజ్ దృశ్యం

నిర్మాతలు లేనిదే చిత్రపరిశ్రమ లేదు

● దర్శకుడు గజేంద్ర

నిర్మాతలు లేనిదే చిత్రపరిశ్రమ లేదని దర్శకుడు గజేంద్ర అభిప్రాయపడ్డారు. తాను దర్శకత్వం వహించిన కొత్త చిత్రం 'కుట్రమ్ తవిర్'. శ్రీసాయి సైంధవి క్రియేషన్స్ పతాకంపై పాండురంగన్ నిర్మాణంలో రూపుదిద్దుకుంది. రిషి రిత్విక్, ఆరాధ్య జంటగా నటించగా, శరవణన్, వినోదిని, ఆనంద్ బాబు, సెంద్రాయన్, జార్జ్ విజయ్, సాయిదీనా, మీసై రాజేంద్రన్, బేబీ సాయి సైంధవి తదితరులు ఇతర పాత్రలు పోషించారు. చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక ఆదివారం రాత్రి నగరంలో జరిగింది. సినీ ప్రముఖులు గంగై అమరన్, పేరరసు తదితరులు హాజరై ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు గజేంద్ర మాట్లాడుతూ, 'ఇది మాకు తొలి చిత్రం. కర్ణాటక నుంచి వచ్చాం. ఇండస్ట్రీకి కొత్త. నిర్మాతలు లేకుంటే చిత్రపరిశ్రమ లేదు. నిర్మాత పూర్తి సహాయ సహకారాలు అందించడం వల్లే ఈ చిత్ర షూటింగ్ అనుకున్న సమయంలో పూర్తి చేసామన్నారు. సంగీత దర్శకుడు గంగై అమరన్ మాట్లాడుతూ, 'కర్ణాటక నుంచి వచ్చి తమిళ చిత్రాన్ని నిర్మించిన దర్శక నిర్మాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. సాధారణంగా ట్రైలర్ రిలీజ్ వేడుకలో పాటలు, యాక్షన్ సన్నివేశాలను మాత్రమే ప్రదర్శిస్తున్నారు. కానీ, సెంటిమెంట్ సీన్లు కూడా ప్రదర్శించాలని కోరుతున్నా. నేను ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిని. ఏదైనా లోటుపాట్లు ఉంటే అప్పుడే చెప్పేస్తాను. వీటిని పాజిటివ్‌గా తీసుకోవాలి. అద్భుతమైన సంగీత స్వరాలను సమకూర్చిన సంగీత దర్శకుడు శ్రీకాంత్ దేవాను అభినందించారు. సినీ దర్శకుడు పేరరసు మాట్లాడుతూ, 'ఒక్క సినిమా మాత్రమే అన్ని శాఖలను సమన్వయం చేసి ఏకతాటిపై ఉండేలా చేస్తుంది. ఇందుకు ఈ వేదికే ఒక ఉదాహరణ. వేదికపై ఆధ్యాత్మిక, రాజకీయ, రక్షణ, పోలీస్, మీడియా ఇలా అన్ని రంగాల ప్రముఖులున్నారు. సాధారణంగా ఒక శాఖ కార్యక్రమం అంటే ఆ శాఖకు చెందిన వారు మాత్రమే పాల్గొంటారు. కానీ, సినిమా వేడుకలకు మాత్రం అన్ని శాఖలకు చెందిన వారు ఒక వేదికపైకి వస్తారు' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

సినిమాలకు తమిళ పేర్లు పెట్టడం తెలియడం లేదు

● నిర్మాత కె.రాజన్



నేహా రత్నాకరన్ - ఆదమ్ హాసన్

తమిళ సినిమాలకు తమిళ పేర్లు పెట్టడం తెలియడం లేదని సీనియర్ నిర్మాత, నటుడు కె.రాజన్ అన్నారు. సస్పూన్ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత పాలేష్ జార్జ్ నిర్మాణంలో సచీంద్రా కె.శంకర్ దర్శకత్వంలో వైవిధ్యభరితమైన కథతో రూపొందిన చిత్రం 'అగమెళి విళిగల్' మే 9వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్రం ఆడియో, ట్రైలర్‌ను నగరంలో తాజాగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు ఆర్కే అన్బళగన్, మంగైరాజన్, తమిళనాడు థియేటర్ల సంఘం అధ్యక్షుడు తిరుచ్చి శ్రీధర్, హీరోయిన్ నేహా రత్నాకరన్, హీరో ఆదమ్ హాసన్, సీనియర్ నిర్మాత కె.రాజన్, స్టంట్ మాస్టర్ జాగ్వార్ తంగం, దర్శకులు పేరరసు, సచీంద్ర కె.శంకర్ తదితరులు పాల్గొని, ఆడియో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.రాజన్ మాట్లాడుతూ, 'ఈ యేడాది ఇప్పటి రకు కేవలం నాలుగు చిత్రాలు మాత్రమే విజయం సాధించాయి. గత యేడాది 220 చిత్రాల్లో 8 సినిమాలు సక్సెస్ సాధించాయి. చిన్న బడ్జెట్ చిత్రాల్లో 15 విజయం సాధించాయి. పెద్ద హీరోల వెనుక నడిస్తే సినిమా విజయం సాధించదు. ఈ సినిమా టైటిల్ చాలా బాగుంది. తమిళ చిత్రాలకు తమిళంలో పేర్లు పెట్టడం మరిచిపోయారు. అజిత్, సూర్య వంటి హీరోలు కూడా తమ చిత్రాలకు ఆంగ్లంలో పేర్లు పెడుతున్నారు. కానీ కేరళ సోదరులు తమిళనాడు వచ్చి తమిళ టైటిల్‌తో సినిమా తీయడం సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ, కేవలం కథను నమ్ముకుని మాత్రమే సినిమాలు తీయాలి. నా కుమారుడు హీరోగా నటించాలి, తమ్ముడు సంగీతం సమకూర్చాలి అంటూ సినిమాలు తీయొద్దు అని హితవు పలికారు.

రీ రిలీజ్‌లోనూ 'సచిన్' సూపర్ హిట్



కలైపులి ఎస్.థాను, జాన్ మహేంద్రన్ తదితరులు

రెండు దశాబ్దాల క్రితం విజయ్ హీరోగా నటించిన 'సచిన్' చిత్రాన్ని రీ రిలీజ్ చేయగా ఇపుడు కూడా ఘన విజయం సాధించింది. దీంతో సక్సెస్ వేడుకలను చిత్ర బృందం నిర్వహించింది. ఇటీవల కాలంలో రీ రిలీజ్ చేసే పాత చిత్రాల సంఖ్య పెరిగిపోయింది. ఇందులో భాగంగా 2005లో విజయ్ హీరోగా నటించిన 'సచిన్' మూవీ ఈనెల 18న విడుదలచేశారు. ఈ మూవీ సక్సెస్ వేడుకలను నగరంలో తాజాగా నిర్వహించారు. ఇందులో నిర్మాత కలైపులి ఎస్.థాను మాట్లాడుతూ, 'సచిన్' చిత్ర స్టోరీని విజయ్ ఖరారు చేయడం వెనుక పెద్ద కథే ఉంది. 'తిరుప్పాచ్చి', 'మదురై' వంటి పూర్తి యాక్షన్ చిత్రాల్లో నటిస్తూ మంచి ఊపుమీదున్న విజయ్ సినిమా కెరీర్‌కు ఒక టర్నింగ్ పాయింట్ కావాలని దర్శకుడు జాన్ మహేంద్రన్ దగ్గరున్న కథను విజయ్‌కు వినిపించాం. కథ విన్న తరువాత విజయ్ అంగీకరించడంతో 'సచిన్' సినిమా సాధ్యమైంది' అని అన్నారు.దర్శకుడు జాన్‌మహేంద్రన్ మాట్లాడుతూ, 'సచిన్' మూవీని రీ రిలీజ్ చేసిన విషయమే నాకు తెలియదని, మళ్లీ సక్సెస్ వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ఈ సినిమా వచ్చి 20యేళ్ళు గడిచిపోయినా, కొత్తగా విడుదలైనట్టుగా ఉంది. రీ రిలీజ్‌లోనూ అభిమానులు బ్రహ్మరథం పట్టడం సంతోషంగా ఉందన్నారు.

నటిస్తూ జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నా

● శృతిహాసన్





తండ్రి కమల్‌తో శృతి

సినిమాల్లో నటిస్తూ జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నట్టు హీరోయిన్ శృతిహాసన్ స్పష్టంచేశారు. ఆమె తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నేను ఎల్లవేళలా సింగిల్‌గానే ఉన్నాను. ఎవరితోనూ ఇట్టే కలిసిపోలేను. ఇపుడు సినిమాల్లో నటిస్తూనే జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నాను. పైగా నేను రిలేషన్‌లో ఉన్నపుడు నమ్మకంగానే ఉంటానని, అయితే, ఒకరిని భాగస్వామిగా ఎంచుకోనప్పుడు, దాని గురించి ఇతరులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అదేసమయంలో నేను కొందరు వ్యక్తులను బాధపెట్టాను. అలా చేసివుండకూడదని ఇపుడు అనిపిస్తోందని విచారం వ్యక్తం చేశారు. మిగతా విషయాల్లో నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. కొన్ని సందర్భాల్లో నేను సరదాగా, తెలివితక్కువగా ప్రవర్తించి ఉండొచ్చు. అది పెద్ద విషయం కాదు. కానీ, నాకు అత్యంత విలువైన కొందరిని నా పొరపాటు వల్ల గాయపరిచాను. ఇపుడు వారికి క్షమాపణలు చెప్పడానికి ప్రయత్నిస్తున్నాను' అని పేర్కొన్నారు.

వేడుకగా 'ప్రోవోక్ అవార్డుల' ప్రదానోత్సవం



నటి ఐశ్వర్యా రాజేష్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సినీ, సాంస్కృతిక, వ్యాపార వంటి రంగాల్లో విశేష ప్రతిభాపాటవాలు ప్రదర్శించడంతో పాటు సేవాభావం ఉన్న వారికి ఇచ్చే 'ప్రోవోక్' అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి నగరంలోని ఓ హోటల్ లో ఘనంగా జరిగింది. 500 మంది కంటే అధికంగా వీఐపీలు, వెయ్యికి పైగా సినీ తారల మధ్య 80కి పైగా పురస్కారాలను ప్రదానం చేయగా సినీ దర్శకుడు భాగ్యరాజ్, నటి ఖుష్బూ, దర్శకులు ఆర్.పార్తీబన్ తదితరులు జీవనసాఫల్య పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ సహాయ నటి అవార్డును నటి ఐశ్వర్యా రాజేష్‌కు అందించారు.

మదురై అళగర్ కోవిల్‌కు 4 కొత్త బస్ సర్వీసులు



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రులు మూర్తి, శేఖర్‌బాబు

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి ఆలయంలో, కళ్లగర్ ఆలయంలో చిత్తిరై మహోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మదురై నుంచి కళ్ళలగర్ పర్వతాలయానికి 4 కొత్త బస్ సర్వీసులను రాష్ట్ర మంత్రులు మూర్తి, పీకే శేఖర్‌బాబు సోమవారం ప్రారంభించారు. అళగర్‌కోవిల్ నుంచి సోలమలై మురుగన్ ఆలయం, రాక్కాయి ఆలయానికి భక్తులు సులువుగా వెళ్లేందుకు ఆలయ యాజమాన్యం తరఫున బస్సులు నడుపుతున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో కొత్తగా నాలుగు బస్సులు కొనుగోలు చేశారు. ఈ నాలుగు బస్ సర్వీసులను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పీకే శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ శాసనసభలో ప్రకటించినట్లు రూ.1.20 కోట్లతో నాలుగు కొత్త బస్సులను అళగర్‌కోవిల్ భక్తుల కోసం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ బస్సుల్లో కొండదిగువ నుంచి కొండపైకి వెళ్లేందుకు రూ.10లు ఛార్జీగా వసూలు చేస్తారని చెప్పారు. కళ్లలగర్ చిత్తిరై వేడుకల నిర్వహణకు ఆలయ నిర్వాహకులు, ట్రస్టీలు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖ, కార్పొరేషన్, దేవాదాయ శాఖ, ఆరోగ్య శాఖ సమష్టిగా చిత్తిరై ఉత్సవాల్లో భక్తులకు అవసరమైన సేవలందిస్తాయని చెప్పారు.

జీహెచ్‌లో రూ.14లక్షలతో టీనేజర్స్ ట్రీట్‌మెంట్ సెంటర్

● ప్రారంభించిన మంత్రులు



చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీహెచ్)లో రూ. 2.40 కోట్లతో ఏర్పాటు చేసిన చెవి ఎముక శస్త్రచికిత్స ప్రయోగశాలను మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈఎన్‌టీ స్పెషలిస్ట్, మాజీ సంచాలకులు డాక్టర్ ముత్తుకుమార్ చెవి ఎముక చికిత్సపై ముద్రించిన గ్రంథాన్ని కూడా ఆవిష్కరించారు. అదే సమయంలో రూ.14 లక్షలతో యువకుల కోసం ఏర్పాటు చేసిన చికిత్సా కేంద్రాన్ని, రూ.94లక్షలతో నిర్మించిన మధుమేహ ప్రత్యేక చికిత్సా కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య, ప్రజారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, జాతీయ ఆరోగ్య సంస్థ సంచాలకులు డాక్టర్ అరుణ్ తంబురాజ్, వైద్యవిద్యా పరిశోధన విభాగం సంచాలకుడు డాక్టర్ శంఖుమణి, చెన్నై వైద్య కళాశాల డీన్ డాక్టర్ శాంతారామ్, ఈఎన్టీ సంచాలకులు డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా శాస్త్ర వర్సిటీ 'లాజికల్ కనెక్ట్'



'లాజికల్ కనెక్ట్-2025' సదస్సులో ప్రసంగిస్తున్న విద్యావేత్తలు

అడయార్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఒకటైన 'శాస్త్ర' విశ్వవిద్యాలయం 'లాజిస్టిక్ కనెక్ట్-2025' పేరుతో ఇటీవల ఒక సదస్సు నిర్వహించింది. వడపళనిలో జరిగిన సదస్సులో 'సమకాలీన రాజ్యాంగవాదం : కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ప్రభావం' అనే అంశంపై సమగ్రమైన చర్చ జరిగింది. ఇందులో సీనియర్ అడ్వకేట్ సీఎస్ వైద్యనాథన్, అరవింద్ దతార్, విధి సెంటర్ లీగల్ పాలసీ ఫౌండర్ డైరెక్టర్ అర్యసేన్ గుప్తా వంటి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు ప్రముఖ న్యాయవాది, రీసెర్చ్ స్కాలర్ అమృత్ భార్గవ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. భారతదేశం 75 యేళ్ళ రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని గుర్తు చేసుకుంటున్నందున సహకార సమాఖ్య వాద స్ఫూర్తిని పునరుద్ధరించాల్సిన తక్షణ అవసరాన్ని ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు పేర్కొన్నారు.

'తాండవ్'తో యువతుల ఆరోగ్యం మెరుగు

● డాక్టర్ ఆర్ఎం అంజనా



చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హై-ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ ఆధారంగా పది నిమిషాల నృత్య వ్యాయామం అయిన 'తాండవ్'తో యువతుల్లో ఆరోగ్యం మెరుగు పడుతోందని మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్ఎం అంజనా పేర్కొన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మధుమేహం, బాల్యంలో ఊబకాయం వంటివాటిపై జరిగిన అధ్యయనం గురించి వివరించారు. భారతీయ యువతకు సాంస్కృతికంగా రూపొందించబడిన ఈ కార్యక్రమం శారీరక శ్రమ, గుండె ఆరోగ్యం వంటివాటిల్లో గణనీయమైన మెరుగుదల చూపించిందన్నారు. చెన్నైలోని 13-15 సంవత్సరాల వయసు గల 108 మంది బాలికలపై ఈ అధ్యయనం చేశామన్నారు.

30న శివ సుబ్రమణ్యస్వామి ఆలయ మహాకుంభాభిషేకం



యాగశాల ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట మింట్ వీధిలోని శివ సుబ్రమణ్యస్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఈ నెల 30న జరుగనుంది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో యాగశాల పూజలు ప్రారంభించారు. బుధవారం ఉదయం వళ్లీ,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారి సన్నిధి, ఆలయ గోపుర విమానాలకు జీర్ణోద్ధరణ, అష్టబంధన మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం విఘ్నేశ్వర ప్రార్థన, మహా గణపతి హోమం, నవగ్రహ హోమం, సాయంత్రం వాస్తుశాంతి, గ్రామశాంతి తదితర పూజలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ జె.హరికుమార్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి కూత్తాండవర్ ఆలయ ఉత్సవాలు ప్రారంభం



కూత్తాండవర్ స్వామివారు

ప్యారీస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా ఎలుందూర్‌పేట సమీపంలోని కూవాగం గ్రామం చిత్తిరై ఉత్సవాలకు ముస్తాబయ్యింది. హిజ్రాల ఆరాధ్యక్షేత్రంగా పేరుగాంచిన కూత్తాండవర్ ఆలయంలో మంగళవారం చిత్తిరై ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 18 రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ఈ వార్షిక ఉత్సవాల సందర్భంగా కూవాగం గ్రామంలో పండుగ వాతావరణ నెలకొంది. ఆదివారం ఉదయం స్తంభస్థాపన పూజలో ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. మే 2న భీష్ముడు, 3న ధర్మరాజు, 7న కూత్తాండవర్ జననంపై మహాభారత ప్రసంగాలుంటాయి. 13న స్వామివారి నేత్రాలను తెలిచే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆ రోజు రాష్ట్రంనుంచే కాకుండా ముంబయి, కోల్‌కతా తదితర రాష్ట్రాలనుంచే కాక, అమెరికా, సింగపూర్ తదితర దేశాల నుంచి లక్షలాది మంది హిజ్రాలు ఇక్కడికి వచ్చి, ఆలయ పూజారితో తాళికట్టించుకుని ఆ రాత్రంతా ఆటపాటలతో ఆలయ ప్రాంగణంలో సందడి చేస్తారు. 15వ తేదీ రథోత్సవంలో హిందూ దావాదాయ శాఖ అధికారులు పాల్గొంటారు. మే 16న ధర్మరాజు పట్టాభిషేకం, తిరుమంజనం పూజలతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.

ప్రకృతి వ్యవసాయమే లక్ష్యం

● ఉడుపి తీర్థ పీఠాధిపతి ఈషాప్రియ



వేలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మశుద్ధితో ఆలోచిస్తే దేహశుద్ధి మనసొంతమవుతుందని ఉడుపి తీర్థ పీఠాధిపతి ఈషాప్రియ స్వామీజీ పేర్కొన్నారు. హైందవ ధర్మ పరిరక్షణ కోసం షోలింగర్ కృష్ణమఠం నుండి ఆయన సోమవారం ఉదయం పాదయాత్ర ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆలయంలో స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ప్రకృతి వ్యవసాయమే మానవాళికి శ్రేయస్కరమని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, బద్రీనాథ్, కమల, కల్పన, కిరణ్‌కుమార్, శ్రావణ్, సోము తదితరులు పాల్గొన్నారు.



రిప్పన్‌భవనంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియాను మర్యాదపూర్వకంగా కలుసుకున్న రష్యా డిప్యూటీ రాయబారి వెలేరి కొడ్జేవ్, రాయబార కార్యాలయం సమన్వయకర్త ఆండ్రీ ఏరోకిన్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు న్యాయమూర్తులను బెదిరిస్తోందని ఆరోపిస్తూ, అందుకు నిరసనగా సోమవారం చెన్నైలో ధర్నా చేస్తున్న అఖిలభారత బీఆర్ అంబేద్కర్ న్యాయవాదుల సంఘం సభ్యులు

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గూడూరులో ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కరీమాబేగం సోమవారం తెలిపారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన సెల్వకుమార్ మోహన్ రూ.30 వేల విలువ చేసే ఆరు కిలోల గంజాయి తీసుకెళ్తుండడంతో పట్టుకున్నామన్నారు.

30న నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 30వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్షను మే 15వ తేదీ నిర్వహించనున్నారు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కారణంగా పరీక్ష వాయిదా వేసినట్లు పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి విభాగంలో రాజన్న ఫౌండేషన్‌కు అవార్డు

రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి విభాగంలో బెస్ట్ 3 స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇనిషియేటివ్ ఆఫ్ ద ఇయర్ 2025 అవార్డును రాజన్న ఫౌండేషన్ అందుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో రాజన్న ఫౌండేషన్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా సోమవారం న్యూఢిల్లీలోని హయత్ సెంట్రల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్ళపల్లి ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, ఎక్స్ జనరల్ రమేష్ సచిదేవ్ చేతులు మీదుగా అందుకున్నారు. అవార్డు రావడం పట్ల రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు, అమర రాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ హర్షం వ్యక్తం చేశారు.



న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకుంటున్న దృశ్యం

సర్వదర్శనానికి 6 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,177

తలనీలాలు సమర్పించినవారు: 23,694









నగరానికి సప్తవర్ణాల గొడుగు

ప్రసవం ఒక వేదన.. జననం ఒక ఆనందం.. తల్లికైనా.. పుడమి తల్లికైనా! మబ్బులు ముసురుకున్నంత మాత్రాన సూర్యోదయం ఆగదు. పసుపుపచ్చని లేత రంగులు నారింజవర్ణంలోకి మారి.. రవి కిరణ స్పర్శతో ఎర్రబారి.. నీలిమబ్బుల గొడుగుపట్టి.. ఇదిగో ఇలా ఎగసి వచ్చే భానుడికి రాగరంజితమై స్వాగతం పలుకకా తప్పదు.

సోమవారం ఉదయం తిరుపతి నగరంలో కనిపించిన నింగి వర్ణ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ అందిస్తున్నారు.



సోమవారం నాటి ప్రమాదంలో ధ్వంసమైన కారు

అతివేగం.. నిద్రమత్తు

రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణాలు

గతేడాది మే 27న చంద్రగిరి మండలం ఎం.కొంగరపల్లి వద్ద అతి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పింది. కల్వర్టును ఢీ కొంది. ఈ ప్రమాదంలో నరసరావుపేటకు చెందిన ఆరుగురు మృతి చెందారు. సోమవారం నాటి ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఇలా ఏడాది కాలంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై 26 ప్రమాదాలు చోటుచేసుకున్నారు. వీటిలో 32 మంది దుర్మరణం చెందారు. 11 మంది తీవ్రంగా గాయపడగా.. మరెందరికో స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదాలన్నింటిని పరిశీలించిన పోలీసులు.. అతివేగం, నిద్రమత్తే ఈ అనర్థాలకు కారణాలుగా విశ్లేషిస్తున్నారు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి రెండు వరుసల రోడ్డుగా ఉన్నప్పుడే తరచూ ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ఆరు వరుసలు రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఒక్కో వైపు మూడు వరసల రహదారి కావడం.. రోడ్డు బాగా వుండడంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. సోమవారం నాటి ప్రమాదానికీ అతివేగమే కారణమని ప్రాథమిక సమాచారం. నెమ్మదిగా వెళుతున్న కంటైనర్‌ను వెనుకనుంచీ ఎంతో బలంగా ఢీకొడితే గానీ కిందకు కారు దూసుకుపోయే అవకాశం లేదని పోలీసులు అంటున్నారు.

విశ్రాంతిలేని ప్రయాణం

ఇక, తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి క్షేత్రాల సందర్శనకు దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఎక్కువ మంది సొంత.. అద్దె వాహనాల్లో బయలుదేరి తమ యాత్రను తక్కువ వ్యవధిలో ప్లాన్ చేసుకుంటారు. అలాంటప్పుడు సెల్ఫ్ డ్రైవింగ్ లేదా, డ్రైవర్లు కంటిన్యూగా ఎక్కువ దూరం వాహనాన్ని నడపడటంతో అలసట, నిద్రలేమి తలెత్తుతోంది. వేగంగా వచ్చే క్రమంలో కంటిమీద రెప్ప పడితే చాలు.. వాహనం అదుపు తప్పి ప్రమాదానికి కారణమవుతుంది. వేగంగా వెళ్లే సమయంలో జరిగే ప్రమాదాలతో ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోంది. పరిమిత వేగం.. డ్రైవర్లకు విశ్రాంతి ఉండేలా యాత్ర ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

నిదానమే ప్రధానం వేగంకన్నా ప్రాణం మిన్న

జాతీయ రహదారి ఎక్కగానే ఈ సూక్తులను మరచిపోతున్నారు వాహన చోదకులు. టైమే లేదన్నట్లు.. వెంటనే వెళ్లిపోవాలన్నట్లు వాహనాలను పరుగు పెట్టిస్తున్నారు. మరో వైపు విశ్రాంతి లేక.. వాహనాన్ని నడిపే క్రమంలో అలసటతో పాటు కునుకుపాటు తప్పడంలేదు. అంతా బాగున్నంత వరకు ఇవన్నీ ఓకే.. కాకుంటే ప్రాణాలే పోతున్నాయి. ఎందరో వికలాంగులుగా మారుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

హైవే పెట్రోలింగ్‌ను పటిష్ఠం చేస్తాం

ప్రమాదాలకు అతివేగం, నిద్రమత్తు కారణాలుగా తెలుస్తోంది. వీటిని అరికట్టేందుకు హైవే పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ఠరుస్తాం. స్పీడ్ మానిటరింగ్ ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించేలా చర్యలు చేపడుతున్నాం. జాతీయ రహదారుల్లో రాత్రి, తెల్లవారు జామున వాహనాలను ఆపి తరచూ తనిఖీ చేస్తున్నాం. 'ప్లీజ్ రండి.. వాహనం ఆపండి. దయచేసి మంచినీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. కాసేపు విశ్రాంతి తీసుకుని ప్రయాణించండి' అనే నినాదాలతో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తాం. తద్వారా కొంతవరకు రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి సాధ్యమవుతుంది.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సగం సమస్యలు రెవెన్యూవే

కలెక్టరేట్ చుట్టూ అర్జీదారుల ప్రదక్షిణలు ● పీజీఆర్ఎస్‌కు 285 వినతులు

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో వస్తున్న సమస్యల గురించి రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో వారం వారం ప్రజలు అర్జీలు చేతబట్టుకుని కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల్లో 80 శాతం భూ సమస్యలపైనే అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 285 మంది అర్జీదారులు వినతులు అందించారు. అందులో 145 రెవెన్యూ శాఖకే వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె



రెండేళ్లుగా సమస్యలు చెప్పుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికీ స్పందించకపోతే వచ్చే సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించుకున్నామని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. ఈ మేరకు వారు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీహెచ్‌వోలు ప్రవళిక, మోహన్, అపర్ణ, సౌమ్య, రేవతి, నళిని, షీబా పాల్గొన్నారు.

మా బడి మా ఊరిలోనే ఉండాలి



ఎమ్మెల్యే ఆదిమూలంతో మాట్లాడుతున్న ఇప్పలాంగల్ గ్రామస్తులు

'అయ్యా మాది నారాయణవనం మండలం, కళింమిట్ట పంచాయతీ, ఇప్పలాంగల్. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులను పక్క గ్రామమైన డీకేపాళెం పాఠశాలకు వెళ్లాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే ఆ ఊరికి వెళ్లాలంటే శ్మశానం, చెరువులు, గుంతలు దాటుకుని వెళ్లాలి. వర్షాకాలం వస్తే ఇబ్బందులు తప్పవు. అందుకే పిల్లలను అక్కడికి పంపించేది లేదు. మా బడి మా ఊరిలోనే ఉంచండి' అంటూ గ్రామానికి రమ్య, పూజ, మీనా తదితరులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అదే సమయంలో కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కలిసి సమస్యను వివరించారు.

పింఛన్ కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా..



'నా భర్త ఆటోడ్రైవర్. రెండేళ్ల క్రితం మరణించాడు. నేను దివ్యాంగురాలిని. ఒంటరిగా ఉంటున్నాను. జీవనోపాధి చాలా దుర్భరంగా ఉంది. పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి మహాప్రభు' అంటూ ఆటోనగర్‌కు చెందిన విజయలక్ష్మి అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమైంది.

హైస్కూల్ ఏర్పాటు చేయండి : తిరుపతి నగరంలోని 25వ డివిజన్‌లో ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నరసింహాచారి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించాడు. స్కూల్‌ను అప్‌డేట్ చేసి హైస్కూల్‌గా మార్చాలని అనేకమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

వేలిముద్రలు పడలేదని బియ్యం ఇవ్వడం లేదు



సార్! మాది దొరవారిసత్రం, ఏడింబాకం రాజుపాలెం గ్రామం. నా వయసు 50 ఏళ్లు. వేలిముద్రలు పడకపోవడం, చూపు లేకపోవడంతో ఏడు నెలలుగా రేషన్‌షాపులో బియ్యం ఇవ్వడం లేదు. వీఆర్వోను ఎన్నిసార్లు అడిగినా సమస్యను పరిష్కరించలేదు. మీరైనా కనికరించండి.

- రమణమ్మ, ఏడింబాకం రాజుపాళెం, డీవీసత్రం

పింఛను మంజూరు చేయండి



నా భర్తకు కిడ్నీ సమస్యతో డయాలసిస్ చేస్తున్నారు. నాకు పక్షవాతంతో శరీరం సహకరించడంలేదు. నడవడానికి కూడా వీలు కావడంలేదు. కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. పింఛను కోసం తిరుగుతూనే ఉన్నా కనికరించడం లేదు. మీరైనా స్పందించండి.

- మునెమ్మ, దిగువ మల్లవరం, రేణిగుంట మండలం

రూ.2.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

ఏడుగురు స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి-పంగూరు మెయిన్ రోడ్డులోని దొమ్మరపాళెం వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి, 72 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లారీ, కారును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం ఆదివారం శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. కాటూరు ఫారెస్టు బీటు పరిధిలో పంగూరు మెయిన్ రోడ్డు దొమ్మరపాళెం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున కారు, దాని వెనుక లారీ వస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించి కొద్ది దూరంలో ఆపి, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు చుట్టుముట్టి ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లారీని పరిశీలించగా 72 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాలతో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లలో నలుగురు తిరుపతి జిల్లా, ముగ్గురు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. ఎర్రచందనం విలువ రూ.2.5 కోట్లు ఉంటుందని టాస్క్‌ఫోర్సు అధికారులు అంచనా వేశారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్ సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న మినీవ్యాన్ : టీడీపీ నేత మృతి

● మృతుడు గురుమూర్తిని అర కిలోమీటరు లాక్కెళ్లిన వ్యాన్





ప్రమాదానికి కారణమైన మినీవ్యాన్, గురుమూర్తి (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలోని ద్వారకాపురం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు ఎల్లు గురుమూర్తి (52) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన గురుమూర్తి, అదే గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి మోటరు సైకిల్‌పై ఆదివారం రాత్రి నాయుడుపేట నుంచి స్వగ్రామమైన అత్తివరానికి బయలుదేరారు. ద్వారకాపురం వద్ద వీరు ప్రయాణిస్తున్న మోటరు సైకిల్‌ను వెనుక నుంచి మినీవ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటరు సైకిల్ నడుపుతున్న అనిల్‌రెడ్డి కింద పడిపోగా, వెనుక కూర్చొని వున్న గురుమూర్తి మినీ వ్యాన్‌కు తగులుకోవడంతో అర కిలోమీటరు వరకు లాక్కొని వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన గురుమూర్తి అక్కడిక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలపాలైన అనిల్‌రెడ్డిని 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గురుమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదానికి కారణమైన మినీవ్యాను డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న మరో వ్యక్తి పరారయ్యారు.

ప్రమాదం తీరు పట్ల అనుమానాలు

గురుమూర్తి స్వగ్రామమైన అత్తివరంలో 20రోజుల కిందట ఆయన సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాను రెండు రోజుల కిందట అత్తివరంలోనే ఉండటం, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌తో పాటు మినీవ్యానులో ఉన్న మరో వ్యక్తి పరారవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా, గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు గురుమూర్తి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అదే గ్రామానికి మరి కొంతమంది ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైసీపీలో నుంచి టీడీపీలో చేరారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య వివాదాలు మరింత ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో గురుమూర్తి మృతి పలు అనుమానాలకు తావిస్తోంది.

పోలీసు బందోబస్తు నడుమ అంత్యక్రియలు

నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం ముగిశాక గురుమూర్తి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం అత్తివరం గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమాదం జరిగిన తీరు పట్ల అనుమానాలు ఉండడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు



ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సీఐలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 102 మంది ఎస్పీ హర్షవర్ధనరాజుకు ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది సీఐలను నియమించి కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఆయా సీఐల వద్దకు వెళ్ళిన ఫిర్యాదులను పరిశీలించి అదనపు ఎస్పీల వద్దకు పంపుతారు. అక్కడినుంచి నేరుగా ఎస్పీ వద్దకు పంపి సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. మరికొన్నింటిని డీఎస్పీలు, సీఐలకు పంపి పరిష్కరించాలని ఆదేశాలు జారీచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, సీఐలు సాదిక్ ఆలీ, జయచంద్ర, శ్రీరాములు, ఇమ్రాన్ భాష, రమణ, గోపి, హరిప్రసాద్, మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.